క్లుప్తంగా

గ్రామపంచాయతీ కార్మికుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులను మభ్య పెట్టడానికి 'సఫాయన్న మీకు సలాం.. మీమ్మల్ని ఎప్పుడు మరిచిపోను' అంటు నమ్మ బలికి, వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారికి నెలకు కనీసం రూ. 19,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు యూనిఫామ్స్, బూట్లు, గ్లౌజులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, భాగ్యమ్మ, అంజయ్య, జయమ్మ, సత్యమ్మ, అమృతమ్మ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



బడంగ్‌పేట కమిషనర్‌కు మట్టి గణపతిని ఇస్తున్న విద్యార్థులు, తదితరులు

బడంగ్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దామని పలువురు పేర్కొన్నారు. బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, మల్లాపూర్‌లలో చిన్నారులు, విద్యార్థులు మట్టి గణనాథులను పంపిణీ చేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అధికారులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. గుర్రంగూడలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉన్నత లక్ష్యాలతోనే ఉత్తమ భవిష్యత్తు

చేవెళ్ల: ఉన్నత లక్ష్యాలే ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ప్రముఖ వక్త, సెన్సార్ బోర్డు మెంబర్ వేణుగోపాల్‌రావు అన్నారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి చర్యలు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జయలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశాలకు ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలందరికీ అబా కార్డులను అందజేస్తుందని తెలిపారు. ఈ కార్డు ద్వారా ఐదు లక్షల బీమా పొందొచ్చన్నారు. పబ్లిక్ హెల్త్ నర్స్ సుందరి, సూపర్ వైజర్లు శ్రీనివాసులు, పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

నందిగామ: చాకలిగుట్ట తండాలో గురువారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందుతులైన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బాక్సర్ జిల్లా బాషీ గ్రామానికి చెందిన తరుణ్ చౌదరి(41) మేకగూడ శివారులోని ఓ గోదాంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. చాకలిగుట్ట తండాలో నివాసం ఉంటున్నాడు. బీహార్‌కు చెందిన అక్షయ్ బింద్ తన భార్య గుడియా దేవిలు సైతం స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ ఇదే తండాలో ఉంటున్నారు. తరుణ్ చౌదరికి అక్షయ్ బింద్ దూరపు బంధువు కావడంతో తరుణ్ చౌదరి తరచుగా అక్షయ్ ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో తరుణ్ చౌదరికి గుడియా దేవికి అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన అక్షయ్.. తన భార్యను పలుమార్లు మందలించాడు. మరోసారి అలా చేస్తే తరుణ్ చౌదరిని చంపేస్తానని భార్యను హెచ్చరించాడు.

గొంతు నులిమి..

ఈ క్రమంలో మృతుడు తరుణ్ చౌదరి గురువారం రాత్రి మద్యం సీసాలను తీసుకొని అక్షయ్ ఇంటికి వచ్చాడు. ముగ్గురు కలిసి మద్యం సేవించిన అనంతరం తాగిన మైకంలో తరుణ్ చౌదరి గడియా దేవితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయాన్ని గమనించిన అక్షయ్.. తరుణ్‌పై దాడి చేశాడు. గడియా సైతం భర్తకు సహకరించడంతో ఇద్దరు కలిసి పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. అనంతరం ఏమి తెలియనట్లు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. విషయం తెలిసిన పోలీసులు ఆర్ఐ రోజా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం వెతుకుతుండగా నందిగామ చౌరస్తాలో అనుమానాస్పదంగా కనపడటంతో అదుపులోకి తీసుకున్నారు.

'పాలమూరు'తో సస్యశ్యామలం

- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- సాగు, తాగు సమస్యకు పరిష్కారం
- బీళ్లుగా మారిన పంట పొలాలకు నీటి సౌకర్యం
- 'పాలమూరు – రంగారెడ్డి' చారిత్రాత్మకం



ప్రాజెక్టును సందర్శిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో బీళ్లుగా మారిన పంట పొలాలు సస్యశ్యామలం అవుతున్నాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఉద్దండాపూర్, కరివెన ప్రాజెక్టులను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారన్నారు. ఎడారిగా మారిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారన్నారు. తాగు, సాగు నీటికి ఇబ్బంది పడ్డ ప్రజల కష్టాలను తీర్చే గొప్ప ప్రాజెక్టని ఎమ్మెల్యే కొనియాడారు. తెలంగాణ సాగు నీటి రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమయ్యిందన్నారు. గతంలో వలసలతో పడావు పడ్డ ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలు ఈ ప్రాజెక్టుతో పంటపొలాలను పచ్చగా మారుస్తుందన్నారు. 60 రోజులు 90 టీఎంసీల నీటిని తరలించేందుకు వీలుగా 5 ఎత్తిపోతలు, 6 జలశయాలను నిర్మించారన్నారు. రోజుకు మూడువేల క్యూసెక్కుల నీరు ఎత్తిపోయగల సామర్థ్యం ఉన్న బాహుబలి మోటార్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయితే రాష్ట్రం పూర్తిగా ఎడారిగా మారుతుందని కొంత మంది నేతలు విమర్శించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఆలోచన శక్తితో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ధాన్యం పండుతుందన్నారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడతుందన్నారు. ఈ ప్రాజెక్టును సందర్శించిన వారిలో శివకుమార్, వంకాయల నారాయణ రెడ్డి, రాంబల్ నాయక్ తదితరులు ఉన్నారు.

సభకు తరలిన నేతలు...

పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వెట్‌రన్ ప్రారంభోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు.

హనుమాన్ దేవాలయంలో పల్లకీ సేవ



స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్న చైర్మన్, భక్తులు

షాద్‌నగర్: ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా భజన భక్త బృందం సభ్యులు ఆట పాటలతో స్వామి వారిని ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యుగేంధర్, ఈశ్వర్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, మాధురి నందకిషోర్, బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర నాయకుడు గోపాల శర్మ, అర్చకులు రఘుపతి రావు, శ్రీశైలంగౌడ్, వసంతరావు, రఘునందన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- సర్దార్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి



షాబాద్: హనుమాన్ దేవాలయంలో పూజలో రవీందర్‌రెడి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సర్దార్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయంలో శ్రీను పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాని, భక్తి భావాన్ని పెంపోందించుకోవాలని సూచించారు. నాగర్‌కుంట మాజీ సర్పంచ్ బర్క శివకుమార్, సత్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. చాకలిగుట్ట తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శనివారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్నారన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, సర్పంచ్ రాజు నాయక్, తులసీ రాం నాయక్, పార్టీలో చేరిన వారిలో గబ్రూనాయక్, చందర్, లింబ్యా, గణేశ్, రవీందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, ముదిగొండ శ్రీహరియాదవ్‌లు

మొయినాబాద్‌రూరల్: రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ముదిగొండ శ్రీహరియాదవ్‌లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలని వారు పేర్కొన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పీవి కన్వెన్షన్ హాల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నాగిరెడ్డిగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు యాదయ్య పార్టీకి వ్యతిరేకంగా ఇతర పార్టీలతో సంబంధాలు కొనసాగించడంతో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచనల మేరకు అతనిని సస్పెండ్ చేశామన్నారు. గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని వారు కోరారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని శనివారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డీఎంహెచ్ ఓకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28వేలమంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారన్నారు. వారికి కేవలం రూ. 9,750 పారితోషికం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో ఆశాలు దుర్భర జీవితాలను గడుపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 18వేల కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, యూనియన్ జిల్లా కోశాధికారి లలిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సిద్దేశ్వర్

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో చేరుతున్నారని పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు యాదయ్యతోపాటు వంద మంది కార్యకర్తలు శనివారం పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను అనేక విధాలుగా మోసం చేసిందన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, కేసరి సంజీవరెడ్డి, మాణిక్యం, రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్, ఫిరోజ్, విజయేందర్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: క్రీడలతో మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. శంకర్‌పల్లి అరుణోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, 17 కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శరీరా ధారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. దీన్ని విద్యార్థులు తప్పకుండా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి, కౌన్సిలర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి స్వాధీనం



గ్రామస్తులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఈఓ శ్రీనివాస్

షాబాద్: వేణుగోపాలస్వామి దేవస్థానానికి ఉన్న భూములను స్వాధీనం చేసుకున్నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, దేవస్థానం ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను అధికారులు ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. షాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 1902లో 2ఎకరాల 11 గుంటల భూమిని దేవాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, రంగారెడ్డి జిల్లా అధికారి ఆదేశాల మేరకు భూమిని స్వాధీనం చేసుకుని ఆ భూమిలో గ్రామస్తుల సమక్షంలో బోర్డు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. మండల రెవెన్యూ సిబ్బంది, ఈఓలు, మధుబాబు, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు పెట్టే వరకు పోరాటం



కొందుర్గులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొందుర్గు: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, ఏబీసీడీలుగా వర్గీకరించేవరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ షాద్‌నగర్ ఇన్‌చార్జి చిన్నోళ్ల అనంతయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ కొందుర్గులో నిరవదిక నిరాహార దీక్షలో శనివారం ఆయన మాట్లాడారు. మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనంద్, వినోద్, సాయిలు, బావయ్య, చంద్రయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) సీనియర్ నాయకుడు బుర్ర రాంచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజు, ప్రేమ్, కుమార్‌యాదవ్, మహేష్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



కేశంపేట: కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు




కొందుర్గు: చౌదరిగూడలో సమ్మెలో అంగన్‌వాడీలు

కేశంపేట: తమను రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. శనివారం పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్‌లు వేర్వేరుగా తమ మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. అంతకుముందు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కళ్లకు గంతలు కట్టుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, గూడ వీరేశ్, భాస్కర్‌గౌడ్, రూప్లానాయక్, రావుల పెంటయ్య, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ హెచ్చరించారు. శ్రీదేవి, మమత, జయగౌడ్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు: తమ న్యాయమైన సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో సమ్మె కొనసాగుతుంది. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టుంగుటూరి నర్సింహా రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య హాజరై మాట్లాడారు. అరుణ, ఊర్మిళ, సంగీత, రామచంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ నీళ్లు తెచ్చిన కారణజన్ముడు కేసీఆర్



సభకు తరలిన ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

షాబాద్: కృష్ణమ్మ నీరు తెచ్చి పాలమూరు ప్రజల పాదాలు కడుగుతామని చెప్పి నేడు ఆ కలను సాకారం చేస్తున్న సీఎం కేసీఆర్ కారణజన్ముడని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ నుంచి జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉండడాపూర్ ప్రాజెక్టుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు దశాబ్దాల కల నెరవేరిందన్నారు. రంగారెడ్డి, పాలమూరు ఎత్తిపోతల పూర్తితో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఉత్సవాలు

- చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: కులమతాలకు అతీతంగా శాంతియుతంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈశ్వరీ బాంకెట్ హాల్‌లో శనివారం గణేశ్ ఉత్సవాలపై వినాయక మిటీలు, మతపెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నవరత్రి ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో గాని నేరుగా గాని పోలీస్‌శాఖ వారికి సమాచారం అందజేయాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల వద్ద కూడా అనుమతి తీసుకొని విద్యుత్ కనెక్షన్‌లు తీసుకోవాలని తెలిపారు. కాలనీల్లో కానీ, గ్రామాల్లో కానీ ఐక్యంగా ఒకే చోట విగ్రహం ఏర్పాటు చేసుకునేలా ప్రయత్నం చేయాలన్నారు. సమస్యలు గొడవలకు దారితీసే ప్రదేశాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేయొద్దని సూచించారు. విద్యుత్ వైర్లు, విద్యుత్‌సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న కూడా విద్యుత్‌శాఖకు సమాచారం ఇస్తే తమ సిబ్బంది సరిచేస్తారని విద్యుత్ ఏఈ ఖాజానయిమోద్దీన్ తెలిపారు. నామినల్ ఫీజులు చెల్లిస్తే మండలపాల వద్దకూడా విద్యుత్‌కనెక్షన్‌లు ఇస్తారన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్, ఆర్ఐ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్నారు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



చేవెళ్లలో బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలో కంజర్ల ప్రకాశ్

షాద్‌నగర్: సమైక్యతా దినోత్సవం పేరుతో సీఎం కేసీఆర్ రాష్ట్ర చరిత్రను వక్రీకరిస్తున్నారని బీజేపీ కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేస్తూ శనివారం షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ నేతలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే, తెలంగాణకు 1948, సెప్టెంబర్ 17 అని పేర్కొన్నారు. రజాకర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణకు విమోచనం కల్పించారని గుర్తు చేశారు. ఓట్ల రాజకీయల కోసం తెలంగాణ స్వాతంత్ర్య చరిత్రను సీఎం కేసీఆర్ వక్రీకరించడం బాధాకరమన్నారు. సమైక్య దినోత్సవం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. తెలంగాణ విమోచనం కోసం ఎంతో మంది అమరులయ్యారని వారి చరిత్రను ప్రజలకు తెలియనీయకుండా సీఎం కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారన్నారు. కర్ణాటకలో విమోచన దినోత్సవాన్ని అక్కడి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అందెబాబయ్య, అశోక్‌గౌడ్, కమ్మరి భూపాలాచారి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, వంశీకృష్ణ, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్, మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్: విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రజలంతా ఆశపడ్డారన్నారు. కానీ సీఎం కేసీఆర్ ముస్లీం ఓట్లకోసం ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. కృష్ణ, లక్ష్మిపతియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అమిత్‌షా ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన అమృత మహోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. అమరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు చీర శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.